సాక్షి ఖమ్మం

9

బుధవారం। 2। అక్టోబర్। 2024

మూలమలుపు.. ఆపై అతివేగం

ఆ దంపతులు తమ బంధువు కర్మకాండకు హాజరై వస్తున్నారు.. ఎదురుగా మరో బైక్‌పై అతివేగంగా వచ్చిన ఇంకో ఇద్దరు మూలములపు వద్ద ఢీకొన్నారు. ఘటనలో దంపతులతో పాటు మరో వ్యక్తి మృతి చెందగా ఇంకొకరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు.



ఇల్లెందు ఆస్పత్రి వద్ద విషణ్ణవదనాలతో వేచిఉన్న మృతుల బంధువులు

10లో

న్యూస్‌రీల్

వాహనాల బీమాకు న్యాయసాయం

ఖమ్మంలీగల్: ఇటీవల వరదలతో వాహనాలకు జరిగిన నష్టానికి బీమా ఉన్నా పరిహారం లభించని కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రీ లిటిగేషన్ విధానంలో పరిష్కరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. ఇలాంటి కేసుల్లో బాధితులు సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు దాఖలు చేయాలని సూచించారు. వరదతో వాహనాలు దెబ్బతిన్నప్పుడు యజమానులు నిబంధనలు తెలియక మరమ్మతులు చేయించి ఆతర్వాత పరిహారం కోసం బీమా కంపెనీని ఆశ్రయిస్తే సాంకేతిక కారణాలతో తిరస్కరిస్తే న్యాయ సాయం పొందొచ్చని తెలిపారు.

కోర్టు నిర్వహణకు భవనాల పరిశీలన

మధిర: మధిరకు నూతనంగా మంజూరైన సీనియర్ సివిల్ కోర్టు నిర్వహణ కోసం మధిర రిక్రియేషన్ క్లబ్ భవనాలను మంగళవారం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ పరిశీలించారు. మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి, న్యాయవాదులతో పలు అంశాలపై చర్చించారు. అవసరమైన మరమ్మతులపై ఆర్ అండ్ బీ ఈఈ జి.తానేశ్వర్‌కు సూచనలు చేశారు.

మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం




విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో బ్యాచ్ ప్రవేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయి సీట్ల విషయంలో స్థానికత సమస్య ఏర్పడడంతో ఈ ఏడాది కౌన్సెలింగ్ ఆలస్యంగా మొదలైంది. ఈమేరకు ఖమ్మం కాలేజీలో వంద సీట్లకు గాను జాతీయ కోటాలో 15 సీట్లు కేటాయించి, మిగతా సీట్లను రాష్ట్ర విద్యార్థులతో భర్తీ చేస్తారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఖమ్మం కాలేజీని ఎంచుకున్న విద్యార్థులకు గాను మొదటి రోజు జాతీయ కోటాలో 12 మంది, రాష్ట్ర కోటాలో 15 మంది ప్రవేశాలు పొందారు. మొదటి బ్యాచ్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఈసారి తమ కళాశాలను ఎంచుకునేందుకు పోటీ పడుతున్నారని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. దీంతో మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ కానున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు అవసరమైన తరగతి గదులు, హాస్టళ్లు సిద్ధం చేసినట్లు వివరించారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సురేంద్రమోహన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యదర్శి(మైన్స్ అండ్ జియాలజీ) కె.సురేంద్రమోహన్‌ను ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రత్యేకాధికారిగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆయన జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించనున్నారు.

ఇందిరా డెయిరీ పనుల్లో వేగం పెంచాలి



ఖమ్మం సహకారనగర్: ఇందిరా డెయిరీ ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఇందిరమ్మ డెయిరీ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులపై సమీక్షించారు. ఇందిరమ్మ డెయిరీకి సంబంధించి పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు త్వరగా పూర్తిచేయడమే కాక మధిర నియోజకవర్గంలోని మండలాల్లో మిల్క్ చిల్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తిచేయాలన్నారు. అలాగే, నర్సరీల నిర్వహణ, హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ల ఏర్పాటు, ఉపాధి హామీ పనుల కల్పన, పాఠశాలల్లో పనుల పురోగతిపై చర్చించి సూచనలు చేశారు. డీఆర్డీఓ సన్యాసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, అదనపు డీఆర్డీఏ నూరొద్దీన్, మెప్మా పీడీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు పరిశీలించిన డీఆర్‌డీఓ

ముదిగొండ: ముదిగొండ, వనంవారి కిష్టాపురంలో ఇందిరా డెయిరీ మిల్క్ చిల్లింగ్ యూనిట్లకు సంబంధించి స్థలాన్ని డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల లభ్యత, వివరాలపై తహసీల్దార్ సునీతతో చర్చించారు.

ఇకపై డిజిటల్ కార్డులు!

- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పది ప్రాంతాలు
- నియోజకవర్గానికి రెండు చొప్పున ఎంపిక
- 2,797 కుటుంబాల నుంచి వివరాల సేకరణ
- రేపటి నుంచి ఈనెల 8 వరకు సర్వే

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పది ప్రాంతాలను ఎంపిక చేశారు. నియోజకవర్గానికి రెండు చొప్పున వీటిని ఎంపిక చేయగా మొత్తంగా 2,797 కుటుంబాల వివరాలు సేకరిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడమే కాక మార్పులు, చేర్పులు ఉంటే నమోదు చేయనున్నారు. కుటుంబ సభ్యులందరూ సమ్మతిస్తే కార్డు కోసం ఫొటో కూడా తీసుకుంటారు. ఈ సర్వే గురువారం నుంచి 8వ తేదీ వరకు కొనసాగనుండగా పర్యవేక్షణకు ఏడుగురు అధికారులను నియమించారు. ఆయా అధికారులు సర్వేను పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు ఇస్తారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఏమిటీ డిజిటల్ కార్డు ?!

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రకరకాల గుర్తింపు కార్డులు ఉన్నాయి. ఆరోగ్య.శ్రీ, రేషన్ కార్డు ఇలా అన్నింటినీ కలిపి డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గానికి రెండు ప్రాంతాలను ఎంపిక చేయగా జిల్లాలో పది ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని కుటుంబాల వివరాలను సర్వే బృందాలు నమోదు చేస్తాయి. రేషన్‌కార్డు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రైతుబీమా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు తదితర వివరాల డేటా ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఉన్నందున ఇవి సరైనవేనా అని నిర్ధారించుకుంటారు. ఆపై కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే పేర్లు తొలగించి, కొత్త వారివి నమోదు చేస్తారు. ఆపై ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేయనున్నారు.

నియోజకవర్గం	ప్రాంతం	కుటుంబాలు
ఖమ్మం	రాములుతండా	165
	54వ వార్డు	1,200
పాలేరు	ధర్మతండా	160
	కోటనారాయణపురం	164
మధిర	17వ వార్డు	170
	సీతంపేట	160
వైరా	14వ వార్డు	190
	కోదండరామాపురం	161
సత్తుపల్లి	22వ వార్డు	230
	వచ్యానాయక్ తండా	197
మొత్తం		2,797

దసరాకు ఆర్టీసీ రెడీ!

- పండుగకు ఊరి బాట పట్టనున్న జనం
- రీజియన్‌లో 727 ప్రత్యేక సర్వీసుల ఏర్పాటు
- బస్సుల కొరత.. ఇతర ఆటంకాలను అధిగమించడంపై దృష్టి
- ఈసారి ఉద్యోగులకు సంస్థ ఆధ్వర్యానే భోజనం, వసతి



డిపోల వారీగా నడిపించే అదనపు బస్సు వివరాలు

డిపో	మొత్తం
ఖమ్మం	202
మధిర	108
సత్తుపల్లి	140
భద్రాచలం	140
కొత్తగూడెం	61
మణుగూరు	48
ఇల్లందు	25
రీజియన్	724

ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. దసరా పండుగకు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వనుండడం, తెలంగాణలో ఘనంగా జరుపుకునే పండుగ కావడంతో అంతా స్వస్థలాలకు బయలుదేరతారు. అయితే, రీజియన్‌ను బస్సుల కొరత వేధిస్తుండగా, మరోపక్క మహాలక్ష్మి పథకం రద్దీ ఉండడంతో ఈ ఆటంకాలను అధిగమించేలా ప్రత్యేక సర్వీసుల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. ఇక మునుపెన్నడూ లేని విధంగా ప్రత్యేక సర్వీసుల్లో విధుల్లో నిర్వర్తించే కండక్టర్లు, డ్రైవర్లతో పాటు ఇతర సిబ్బందికి సంస్థ ఆధ్వర్యాన భోజన, వసతి కల్పించాలని నిర్ణయించడంతో ఉద్యోగులు కూడా ఉత్సాహంగా పనిచేస్తారని భావిస్తున్నారు.

కిటకిటలాడుతున్న బస్సులు.


రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టాక బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. కూర్చోవడం మాటేమో కానీ నిల్చోవడానికి కూడా ఖాళీ ఉండటం లేదు. నిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో 522 బస్సులు రోజుకు 2,46,090 కి.మీ. తిరుగుతున్నాయి. అయినా ప్రయాణికులకు సరిపడా సేవలందడం లేదు. దీంతో దసరా సమయాన పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన ప్రయాణికులనే కాక అధికారులను వేధిస్తోంది. ఈమేరకు విద్యాసంస్థలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో ఇతర జిల్లాల డిపోల నుంచి బస్సులు తెప్పించి ఏయే ప్రాంతాలకు నడిపించాలో కార్యాచరణ రూపొందించారు.

ప్రస్తుతం ఉన్న బస్సులన్నీ రద్దీ ప్రాంతాలకు నడిపిస్తే రెగ్యులర్ రూట్లలో కొరత ఏర్పడుతుంది. అలాకాకుండా హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను ఖమ్మం రీజియన్‌లోని డిపోలకు నడిపిస్తూ మిగతా బస్సులను యథావిధిగా కొనసాగించాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది.

724 ప్రత్యేక బస్సులు

దసరా సందర్భంగా రీజియన్‌లో 724 ప్రత్యేక బస్సులు నడిపించాలని నిర్ణయించారు. ఈనెల 2వ తేదీ నుంచి 11 వరకు.. మళ్లీ 13 నుంచి 17 వరకు ఈ బస్సులు నడిపిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు, 13, 14వ తేదీల్లో ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు నిత్యం 154 బస్సులతో పాటు అదనంగా 100 బస్సులు నడిపించనున్నారు. అలాగే, ప్రత్యేక ప్రణాళికలో భాగంగా 10, 11వ తేదీల్లో అత్యధికంగా 140 బస్సులు నడిపిస్తారు. ఖమ్మం–హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 24గంటల పాటు నాన్ స్టాప్ సర్వీసులు తిప్పేలా ప్రణాళిక రూపొందించారు.

ఆర్టీసీ బస్సులే సురక్షితం



దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు సురక్షిత ప్రయాణం కోసం ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలి. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సులు నడిపిస్తాం. కొన్ని బస్సుల్లో అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది.

– ఎ.సరిరాం, ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్

సీఎంఆర్‌పై సీరియస్!

సాక్షి ఎఫెక్ట్..

- అవకతవకలు, ముడుపులపై డిప్యూటీ సీఎం, మంత్రి ఆరా
- బాధ్యులెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం
- రూ.లక్షల్లో వసూలు చేశారని మంత్రులకు ఫిర్యాదు చేసిన మిల్లర్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని పలు రైస్‌మిల్లుల యాజమాన్యాలు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను ప్రభుత్వానికి అప్పగించడంలో జరిగిన అవకతవకలు, ఈ వ్యవహారంలో పలువురు అధికారులకు ముడుపులు అందాయనే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. మునుపెన్నడూ లేనట్లుగా జిల్లా పౌర సరఫరాల సంస్థలో చోటు చేసుకున్న భారీ అవినీతి మంత్రుల దృష్టికి వెళ్లింది. ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వడంలో మిల్లర్ల మాయజాలం, అధికారుల చేతివాటంపై 'సాక్షి'లో వారం రోజులుగా వరుసగా కథనాలు ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క జపాన్ నుంచి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫోన్ చేశారు. పూర్తి వివరాలు ఆరా తీసిన వారు అవకతవకలకు పాల్పడిన మిల్లర్లపైనే కాక వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన సీఎంఆర్ పక్కదారి పట్టడానికి అధికారులకు రూ.కోట్లలో ముడుపులు అందడమే కారణమనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యాన గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వ్యవహారంలో అక్రమాలపై నిగ్గు తేల్చుతామని వెల్లడించిన డిప్యూటీ సీఎం, మంత్రి.. సీఎంఆర్‌పై దృష్టి సారించాలని కలెక్టర్‌కు సూచించారు.

తనిఖీలతో బయటపడిన వ్యవహారం

ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు కొణిజర్ల మండలంలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లును తనిఖీ చేసిన సమయాన రూ.81.60 కోట్ల విలువైన సీఎంఆర్ పక్కదారి పట్టిందని తేల్చారు. అలాగే మరికొన్ని మిల్లుల్లో రూ.120 కోట్ల మేర సీఎంఆర్‌లో తేడా ఉందని గుర్తించినట్లు తెలిసింది. అయితే, సీఎంఆర్ పక్కదారి పట్టించిన మిల్లర్లు తమకు సహకరించిన అధికారులకు రూ.లక్షలు మొదలు రూ.కోటి వరకు అందించినట్లు ఆరోపణలున్నాయి. కొణిజర్ల మిల్లులో తనిఖీ సమయాన యజమాని తాము అధికారులకు డబ్బు ఇచ్చినా తనిఖీలు ఎందుకు చేస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులను నిలదీసినట్లు తెలిసింది. ఇంకొందరు మిల్లర్లు సైతం అధికారులకు కూడా రూ.లక్షల్లో ముట్టజెప్పామని బహిరంగంగా చెబుతుండడంతో వ్యవహారం మంత్రుల దృష్టికి వెళ్లింది.

వృద్ధుల జీవితానుభవాల్ని యువతకు అందించాలి

- జిల్లా ఆస్పత్రి, కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు
- వయోవృద్ధుల దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలను యువతరానికి అందించాలని.. తద్వారా వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఖమ్మంలోని టీటీడీసీలో జిల్లా సంక్షేమ శాఖ, సీనియర్ సిటిజన్ల ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం, బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజంలో విలువలు కొనసాగడానికి వృద్ధులే కారణమని తెలిపారు. ఈ విషయాన్ని నేటి తరం గుర్తించి వయోవృద్ధులను గౌరవించుకోవాలని, ఇళ్లలో తాత, అమ్మమ్మ, నానమ్మతో ప్రతిరోజు కాసేపైనా గడిపి వారి అనుభవాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కాగా, వయోవృద్ధులకు మెరుగైన చికిత్స అందేలా జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటుచేస్తామన్నారు. కలెక్టరేట్‌లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆతర్వాత అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా బాలికలతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్ రెడ్డి మాట్లాడగా పలువురు వయోవృద్ధులను సన్మానించారు. వివిధ శాఖల అధికారులు విష్ణువందన, వరలక్ష్మి, సునీల్‌కుమార్, బిందుప్రసాద్ సీనియర్ సిటిజన్ల ఆర్గనైజేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.చంద్రమోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై దృష్టి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి ఈనెల 3నుంచి సర్వే మొదలవుతోందని తెలిపారు. అలాగే, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, ఖరీఫ్ ధాన్యం సేకరణపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ కోసం రోజువారీ లక్ష్యంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్వో రాజేశ్వరి, డీపీఓ ఆశాలత, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, వేణు, అహ్మద్ షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రులను కలిసిన గ్రానైట్ అసోసియేషన్ కమిటీ



మంత్రి పొంగులేటితో రాయల, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: 'జిల్లా గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్' నూతన కమిటీ ఇటీవల ఎన్నికకాగా బాధ్యులు హైదరాబాద్‌లో మంగళవారం మంత్రులను కలిశారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యాన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎంపీ రేణుకాచౌదరిని కలిశారు. ఈమేరకు ఖమ్మంలో 20వ తేదీన జరిగే కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని కోరినట్లు అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ తెలిపారు.

కంప్యూటర్‌పై అవగాహన తప్పనిసరి

చింతకాని: విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన తప్పనిసరి, భవిష్యత్‌లో కంప్యూటర్ ఆధారిత కోర్సులు చేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో ఐడీబీఐ ఖమ్మం బ్రాంచ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ అధికారి దినవల్లి వెంకటేష్, ఏజీఎం అంగడి రవికాంత్ శెట్టి, బ్రాంచ్ మేనేజర్ గంగాధర్, ఎంఈఓ వీరపనేని శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావుతో పాటు పాఠశాల చైర్మన్ సుగంధరాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం




లక్ష్మణరావును సన్మానిస్తున్న నాయకులు

మధిర: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఆరోపించారు. మధిర మండలం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు రావిలాల లక్ష్మణరావు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం సన్మానించారు. ఈ సమావేశంలో చావా రవి మాట్లాడుతూ ఇకనైనా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేసి పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా, వృత్తిపై అంకితభావం, నిబద్ధత కలిగిన లక్ష్మణరావును నేటితరం ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీ.వీ.నాగమల్లేశ్వరరావుతో పాటు నెల్లూరి వీరబాబు, తాళ్లూరి ఆంజనేయులు, షేక్ ఇబ్రహీం, వీరయ్య, నాగరాజు, కోటేశ్వరరావు, కళావతి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంకు చెందిన వివాహిత మోడెపు పావని(30) గత నెల 30న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా మంగళవారం కేసు నమోదైంది. ఆమెకు 13ఏళ్ల క్రితం భద్రాద్రి జిల్లా గరీయిపేటకు చెందిన గురుమూర్తితో వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గురుమూర్తికి తొమ్మిదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఏడాదిగా పావని పుట్టింట్లో ఉంటోంది. కూలీ పనులు చేసుకుంటే పిల్లలను పోషిస్తుండగా భర్త అనారోగ్యం, పిల్లల పోషణ భారం కావడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఆమె తండ్రి భీమయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాజు తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,043

మూలమలుపు.. ఆపై అతివేగం



సూర్యనారాయణ - సుగుణ (ఫైల్)



నక్క వెంకటేష్ (ఫైల్)



ఘటనా స్థలిలో పరిశీలిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం

భాగ్యనగర్ తండాలో ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- మృతుల్లో దంపతులు, శ్రీకాకుళం వాసి

కారేపల్లి: మరో ఐదు నిమిషాలైతే ఇంటికి చేరుకోవాల్సిన దంపతులు రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. మరణం కూడా వారి బంధాన్ని విడదీయలేకపోయింది. అయితే, వీరి మృతితో కుమారుడు, కుమార్తె అనాథలుగా మారారు. మరోవైపు వివాహ నిశ్చితార్థం పూర్తయి వచ్చే వేసవిలో వివాహానికి సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు సైతం ఇదే ప్రమాదంలో మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రగాయాలపాలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలోని ఇల్లెందు – కారేపల్లి ప్రధాన రహదారిలోని బొడ్రాసికుంట ఆంజనేయస్వామి గుడి ఎదుట మంగళవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

కర్మకాండలకు వెళ్లొస్తుండగా..

మండలంలోని గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన దంపతులు ఉండం సూర్యనారాయణ (50) - సుగుణ(45) ఇల్లెందు మండలం మామిడిగుండాలలోని తమ బంధువుల ఇంట్లో కర్మకు బైక్‌పై వెళ్లి వస్తున్నారు. ఇంకా రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే వారు స్వస్థలానికి చేరుకునేవారు. అయితే, భాగ్యనగర్ తండా బొడ్రాసికుంట చెరువు, హనుమాన్ గుడి వద్ద మూలమలుపు వద్దకు రాగానే



రోదిస్తున్న సూర్యనారాయణ కుమారుడు జ్ఞానేశ్వర్

ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నక్క వెంకటేష్(32), ఆలియాతండాకు చెందిన కాంట్రాక్ట్ వర్కర్ ధరావత్ రాజు మరో బైక్‌పై కారేపల్లి నుంచి ఇల్లెందు వైపు అతివేగంగా వెళ్తూ మాన ఢీకొన్నారు. ఈ ఘటనలో సూర్యనారాయణ – సుగుణతో పాటు వెంకటేష్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఇక రాజు తలకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మరణంలోనూ వీడని బంధం

గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన సూర్యనారాయణ సుతారి మేస్త్రీగా, సుగుణ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె నల్లగొండలో బీఈడీ చేస్తుండగా, కుమారుడు జ్ఞానేశ్వర్ ఇంటర్ పూర్తి చేశాడు. అన్యోన్యంగా సాగుతున్న వీరి బంధాన్ని మృత్యువు కబళించింది. 'అమ్మానాన్నా.. హన్మంతుడు కూడా మీ ప్రాణాలకు అడ్డు పడలేదా' అంటూ జ్ఞానేశ్వర్ రోదిస్తుండడం స్థానికులను కంటతడి పెట్టించింది.

ఫిబ్రవరిలో వెంకటేష్ పెళ్లి..

శ్రీకాకుళానికి చెందిన వెంకటేష్ సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇటీవల నిశ్చితార్థం కాగా ఫిబ్రవరిలో వివాహానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిసింది. ప్లాంట్‌లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్ రాజుతో కలిసి ఆయన కోట మైసమ్మ ఆలయం వద్ద మరో స్నేహితుడు చేసిన వేడుకకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమాన ప్రమాదం బారిన పడ్డారు.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ముగ్గురి మృతదేహాలను ఇల్లెందు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వారి బంధువులు, కుటుంబీకులు చేరుకోవడంతో ఆర్తదానాలు మిన్నంటాయి. ఇక తీవ్రంగా గాయపడిన రాజుకు డాక్టర్ బన్సీలాల్ ప్రాథమిక చికిత్స చేశాక ఖమ్మం తరలించారు.

మూలమలుపే యమపాశం

భాగ్యనగర్ తండాలో బొడ్రాసికుంట చెరువు వద్ద రోడ్డును ఆనుకుని శ్రీఆంజనేయస్వామి ఆలయం సమీపాన మూలమలుపు ఉంటుంది. గతంలోనూ ఇక్కడ పలు ప్రమాదాలు జరి గాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. అయితే ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేకర్ల వద్దకు వచ్చాక వేగం నియంత్రించలేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మరోపక్క వెంకటేష్, రాజు బైక్‌లో మద్యం బాటిల్ ఉండడంతో వారు అప్పటికే మద్యం సేవించి ఉంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఘటనాస్థలిని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాం పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.



ఖమ్మంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

పూల జాతరకు వేళాయె..

- నేటి నుంచి సంబరాలు షురూ..
- ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభం
- సద్దుల బతుకమ్మతో ముగింపు

ఖమ్మంగాంధీచౌక్ : పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఊరూరా బతుకమ్మ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆడపడుచులు పలు రకాల పూలు సేకరించి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేరుస్తారు. సాయంత్రం వేళ ఆలయాలు, చెరువులు, కూడళ్ల వద్ద ఉయ్యాల పాటలు పాడుతూ బతుకమ్మ ఆడతారు. మహిళలు, యువతులు, చిన్నారుల కోలాటాలు, నృత్యాలతో సందడి నెలకొంటుంది. మహాలయ అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు ఈనెల 10న సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

సంస్కృతికి ప్రతీక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వస్తోందంటే ఆడపడుచులంతా పుట్టింటికి చేరుకుంటారు. గన్నేరు, తంగేడు, గునుగు, అటవి చామంతి, బంతి, నందివర్ధనం, గుమ్మడి, బీర, కట్ల పూలు, మందార, గులాబి, జాజి, రుద్రాక్ష తదితర పూలు సేకరించి బతుకమ్మలు పేరుస్తారు. గునుగుపూలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు అద్దుతారు. ఎంత ఎత్తుగా బతుకమ్మ పేరిస్తే అంత సంపద సమకూరుతుందని మహిళల విశ్వాసం. దీంతో మొదటి, చివరి రోజున బతుకమ్మలను పేర్చడంలో మహిళలు పోటీ పడతారు. బతుకమ్మలను ఒక చోట చేర్చి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. పాటలు పాడుతూ, కోలాటాలు ఆడిన తర్వాత నీటిలో నిమజ్జనం చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజుల ముందు బొడ్డెమ్మ పండుగ కూడా చేస్తారు.

పువ్వుపువ్వుకో ప్రత్యేకత

బతుకమ్మను పేర్చే పూలలో ప్రతీ పువ్వుకో ప్రత్యేకత ఉంది. తంగేడు పువ్వు..పసుపు రంగుతో సకల శుభాలకు సూచిక. గోరింట పూలు ప్రేమానురాగాలకు ప్రతీక. గునుగుపూలు శాంతికి చిహ్నంగా నిలుస్తాయి. బంతి, చామంతి, తామర, కట్ల, గడ్డి పూలు సప్త వర్ణాలు కలిగి ఉంటాయి. ఇలా మహిళలు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలు పేరుస్తారు.

రోజుకో నైవేద్యం..

- **ఎంగిలిపూల బతుకమ్మ :** మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుంది. దీనిని ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. ఈ రోజు నువ్వులు, బియ్యం పిండితో చేసిన ముద్దలను గౌరీదేవికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **అటుకుల బతుకమ్మ :** రెండో రోజు అటుకుల బతుకమ్మగా పిలుస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం సమర్పిస్తారు.
- **ముద్దపప్పు బతుకమ్మ :** మూడు రోజు బతుకమ్మను ముద్ద పప్పు బతుకమ్మ అంటారు. ముద్ద పప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం అందజేస్తారు.
- **నాన బియ్యం బతుకమ్మ :** నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మగా పిలుస్తారు. నానబెట్టిన బియ్యం, నువ్వులు, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **అట్ల బతుకమ్మ :** ఐదో రోజు బతుకమ్మను అట్ల బతుకమ్మ అంటారు. అట్లను నైవేద్యంగా సమర్పిస్తారు.
- **అలిగిన బతుకమ్మ :** ఆరో రోజు వేడుకను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఈ రోజు ఎలాంటి నైవేద్యం చేయరు.
- **వేపకాయల బతుకమ్మ :** ఏడో రోజును వేపకాయల బతుకమ్మ అంటారు. బియ్యం పిండితో వేపపండ్లలా తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు.
- **వెన్నముద్దల బతుకమ్మ :** ఎనిమిదో రోజు బతుకమ్మను వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు. నువ్వులు, నెయ్యి, బెల్లం కలిపి గౌరీ దేవికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **సద్దుల బతుకమ్మ :** తొమ్మిదో రోజు దుర్గాష్టమి నాడు సద్దుల బతుకమ్మ వేడుకను నిర్వహిస్తారు. ఈరోజు పలు రకాల నైవేద్యాలు సమర్పించి బతుకమ్మను సాగనంపుతారు.

పూర్వీకుల నుంచి వస్తున్న పండుగ



తరతరాలుగా బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నాం. మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ ఇది. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి నైవేద్యాలు తయారు చేసి గౌరమ్మకు సమర్పిస్తాం. సద్దుల రోజు ఆడబిడ్డలమంతా అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి సందడి చేస్తాం.

– గాజుల భారతి, బైపాస్‌రోడ్, ఖమ్మం

ఘనమైన పండుగ



మహిళలంతా ఈ పండుగను ఇష్టపడతారు. బతుకమ్మను అందంగా పేర్చడమే కాదు సంప్రదాయ పద్ధతుల్లో రోజుకో నైవేద్యం తయారు చేస్తాం. ప్రతిరోజు సాయంత్రం బతుకమ్మలతో ఆలయాలు, చెరువుల వద్దకు వెళ్లి ఆటపాటలతో ఉత్సాహంగా గడపడం ఆనవాయితీ.

– కడవెండి అరుణకుమారి, ద్వారకానగర్, ఖమ్మం

గర్వంగా చెప్పకుంటాం..



ఆడబిడ్డలు గర్వంగా చెప్పుకునే పండుగ బతుకమ్మ. ఈ పండుగ ప్రాధాన్యత తెలంగాణ ఏర్పడ్డాక మరింత పెరిగింది. ఎంగిలిపూల బతుకమ్మ మొదలు సద్దుల వరకు వేడుకగా జరుపుకుంటాం. మా ప్రాంత మహిళలంతా రకరకాల పూలు సేకరించి పోటీ పడి బతుకమ్మలుఏ పేరుస్తాం.

– దౌలే లక్ష్మీప్రసన్న, బ్రాహ్మణబజార్, ఖమ్మం

రోజంతా నిరీక్షణ

- డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాప్యం
- ఉన్నతాధికారుల నుంచి జాబితా రాలేదన్న అధికారులు
- నేటి నుంచి రోటరీ నగర్ హైస్కూల్‌లో పరిశీలనకు ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేసిన ప్రభుత్వం అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం నుంచే పరిశీలిస్తామని వెల్లడించింది. ఈ మేరకు అధికారులు కూడా జిల్లా కేంద్రంలోని రిక్కాబజార్ పాఠశాలలోఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాలో కేటగిరీల వారీగా 575 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చడమే కాకుండా అభ్యర్థుల సెల్‌ఫోన్లకు మెసెజ్ కూడా పంపిస్తామని అధికారులు వెల్లడించారు. అయినా ఎవరికీ మెసేజ్‌లు రాకపోవడంతో అభ్యర్థులు రిక్కాబజార్ హైస్కూల్‌కు మంగళవారం ఉదయం చేరుకున్నారు. అయితే, అధికారులు మాత్రం తమకు జాబితా అందలేదని మధ్యాహ్నం తర్వాత సర్టిఫికెట్లు పరిశీలిస్తామని చెప్పారు. దీంతో అభ్యర్థులు వేచిఉండగా సాయంత్రం వరకు అదే పరిస్థితి ఉండడంతో బుధవారం రావాలని సూచించగా వెనుదిరిగారు.

అంచనా ఇలా....

జిల్లాలో కేటగిరీల వారిగా ఉపాధ్యాయ పోస్టులు 575 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 1:3 నిష్పత్తి ప్రకారం 1,725మంది అభ్యర్థుల జాబితా విడుదలవుతుందని భావిస్తున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 176పోస్టులు ఉండగా 528మంది, లాంగ్వేజ్ పండిట్ 18పోస్టులకు 54మంది, పీఈటీ పది పోస్టులకు 30మంది, ఎస్‌జీటీ 334 పోస్టులకు 1,002, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎనిమిది పోస్టులు ఉండగా 24మంది, ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 29పోస్టులకు 87మంది చొప్పున వస్తారన్న అంచనాతో 12 టేబుళ్లు ఏర్పాటుచేశారు. అంతేకాక సర్టిఫికెట్ల పరిశీలనకు నియమించిన అబ్జర్వర్ మోడల్ స్కూళ్ల ఏడీ శ్రీనివాసాచారి కూడా జిల్లాకు చేరుకున్నారు. చివరకు జాబితా అందక ప్రక్రియ బుధవారానికి వాయిదా పడింది. ఇక రిక్కాబజార్ హైస్కూల్‌లో బుధవారం నుంచి ఓపెన్ టెస్ట్, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన వేదికను రోటరీనగర్ హైస్కూల్‌కు మార్చారు. బుధవారం నుంచి 5వ తేదీ వరకు ఎస్‌జీటీ అభ్యర్థులకు, 3వ తేదీ నుంచి స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తామని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా, డీ అభ్యర్థుల జాబితా మంగళవారం రాత్రి 7గంటల తర్వాత వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిసింది.



సర్టిఫికెట్ల పరిశీలనకు రిక్కాబజార్ పాఠశాలలో చేసిన ఏర్పాట్లు

ఎదురుచూపులే మిగిలాయి..



రిక్కాబజార్ పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిసి ఉదయం 9–30గంటలకే వచ్చాను. జాబితా అందలేదని చెప్పడంతో నిరాశ ఎదురైంది. ఆతర్వాత మధ్యాహ్నం వస్తుందన్నారు. దీంతో ఇంటికి వెళ్లి మళ్లీ వచ్చాను. అయినా జాబితా రాలేదని చెప్పడంతో వెళ్తున్నా.

– కె.శ్రీను, ఖమ్మం

కొంత సమయమిస్తే బాగుండేది



డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదల చేసి మంగళవారం నుంచే సర్టిఫికెట్ల పరిశీలన అని చెప్పారు. అలాకాకుండా కొంత సమయం ఇస్తే అన్ని సర్టిఫికెట్లు సరిచూసుకునే సమయం లభించేది. తీరా అన్నీ సిద్ధం చేసుకుని వస్తే జాబితా రాలేదని అధికారులు వాయిదా వేశారు.

– ఎస్.రమేష్, బ్రహ్మణపల్లి, వైరా మండలం

ఉదయం నుంచి ఇక్కడే ఉన్నాం



డీఎస్సీ ఫలితాలు విడుదల చేయగానే సర్టిఫికెట్ల పరిశీలన అని చెప్పడంతో ఆనందంగా అనిపించింది. దీంతో ఉదయమే రిక్కాబజార్ హైస్కూల్‌కు వచ్చా. సాయంత్రం వరకు వేచి ఉన్నా జాబితా రాలేదనడంతో నిరాశగా గురయ్యాం. రోజంతా పడిగాపులు కాయాల్సి వచ్చింది.

– ఎస్.జ్యోతి, తిరుమలాయపాలెం మండలం

1,120 కేజీల గంజాయి దహనం

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 1,120.04 కేజీల గంజాయిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం దహనం చేసినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి నాగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1పరిధిలో 484.037 కేజీలు, ఖమ్మం 2 పరిధిలో 170.498కేజీలు, నేలకొండపల్లి స్టేషన్ పరిధిలో 140.645 కేజీలు, వైరా స్టేషన్ పరిధిలో 90.8 కేజీలు, మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 224.485 కేజీలు, సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10.295 కేజీల గంజాయిని మొత్తం 72 కేసుల్లో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.70లక్షల విలువైన ఈ గంజాయిని తల్లాడ మండలం గోపాల్‌పేటలో దహనం చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్ పాల్గొన్నారు.

ఐదు కేజీల గంజాయి పట్టివేత

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు 5.100 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అరుణకుమార్ ఏపీలో కొనుగోలు చేసిన గంజాయితో బస్సులో ఖమ్మం వచ్చాడు. ఆతర్వాత ఆటోలో వెళ్తూ ముదిగొండలో పట్టుబడ్డాడని నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ కె.జగన్నాధరావు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ లత, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, లాలు, రామారావు, హరీష్, బలరామ్ పాల్గొన్నారు.

పల్లిపాడు యువకుడికి డాక్టరేట్



రాజీవ్‌రెడ్డి

కొణిజర్ల: కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన యువకుడికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. పల్లిపాడుకు చెందిన నల్లబోలు మాధవరెడ్డి – భాగ్యలక్ష్మి కుమారుడు రాజీవ్‌రెడ్డి 'ఎడ్యుకేషన్ అండ్ సోషల్ ఇంక్లూషన్ – ఏ స్టడీ ఆన్ ది క్రాస్ సెక్షనల్ ఎనాలసిస్ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్' అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ ప్రకటించారు. ఆయన ప్రస్తుతం ఏపీలోని విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈసందర్భంగా రాజీవ్‌రెడ్డిని పలువురు అభినందించారు.

కోక్యాతండా వాసికి..



రమేష్

కూసుమంచి: మండలంలోని కోక్యాతండాకు చెందిన గిరిజన అభ్యర్థి హలావత్ రమేష్ రసాయన శాస్త్రంలో పరిశోధనలకు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ అంబాని కె.భూనస్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించారు.

ఏన్కూరు మండల వాసికి..



వాసుదేవ్

ఏన్కూరు: ఏన్కూరు మండల కేంద్రానికి చెందిన గుగులోతు గోవిందు – సుమిత్ర కుమారుడు వాసుదేవ్‌కు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించింది. తెలుగు సాహిత్య విభాగంలో పరిశోధనాత్మక గ్రంథం సమర్పించిన ఆయన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

సాగర్ కాల్వలో ముగ్గురి గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. మిగతా వారి కోసం గాలింపు
- జైలులో ఉన్న మిత్రుడిని చూసి వెళ్తుండగా ప్రమాదం
- కన్నీరు మున్నీరుగా బాధిత కుటుంబీకులు



భరత్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. జైలులో ఉన్న తమ స్నేహితుడిని చూసి వెళ్లే క్రమాన స్నానం కోసం కాల్వలోకి దిగగా ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మం సమీపాన దానవాయిగూడెం వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకోగా మంగళవారం ఉదయం వెలుగుచూసింది.

ఆటోలో వచ్చి వెళ్తూ..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం శివలింగాపురానికి చెందిన లారీ డ్రైవర్ చల్లా రమేశ్, ఆటోడ్రైవర్ బండారు భరత్‌కుమార్‌తో పాటు బాపనకుంటకు చెందిన వెంకన్న, కట్టా ప్రసాద్ ఆటోలో సోమవారం ఉదయం ఖమ్మం వచ్చారు. ఇక్కడి జైలులో ఉన్న చల్లా రమేశ్ బంధువు, మిగతా వారికి స్నేహితుడైన వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు రాగా అది వాయిదా పడింది. దీంతో ఆయనను జైలులో కలిసిన అనంతరం నలుగురు తిరిగి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో దానవాయిగూడెంలో నివాసముండే రమేశ్ అన్న కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడ అంతా కలిసి మద్యం సేవించాక తిరిగి వెళ్లే క్రమాన దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద ఆగారు. కెనాల్‌పైకి వెళ్లాలని నిర్ణయించుకోగా వెంకన్న నిరాకరించి ఆటోలోనే పడుకున్నాడు. మిగిలిన ముగ్గురు మెట్ల మార్గం ద్వారా సాగర్ కెనాల్ కట్టపైకి చేరుకున్నారు. అక్కడ స్నానం చేసే క్రమాన ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు.



బండారు భరత్‌కుమార్ (ఫైల్)



కాల్వ వద్ద పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

ఉదయం లేచే సరికి..

ఆటోలోనే నిద్రించిన వెంకన్న మంగళవారం ఉదయం మెలకువ వచ్చాక చూసేసరికి మిత్రులు కానరాలేదు. దీంతో కెనాల్ వైపు వెళ్లగా అక్కడ గట్టుపై దుస్తులు ఉండడంతో ఆందోళన చెందిన ఆయన వారి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ ఆధ్వర్యాన పోలీసులు హుటాహుటిన చేరుకుని గాలింపు చేపట్టగా మధ్యాహ్నం సమయాన బండారు భరత్ కుమార్ (30) మృతదేహం లభ్యమైంది. దీంతో అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు బృందం మృతదేహాన్ని బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక చల్లా రమేశ్, కట్టా ప్రసాద్ కోసం రాత్రి పొద్దుపోయే వరకు నగర ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యాన గాలింపు కొనసాగింది. కాగా, ఈ ఘటనతో మణుగూరు శివలింగాపురం, బాపనకుంటలో విషాద చాయలు అలుముకున్నాయి.

ముగిసిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ శర్మ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య ఆధ్వర్యాన మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు అండర్ -14, 17 విభాగాల్లో బాలురకు కబడ్డీ, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో తర్ఫీదు పొందడంతో పాటు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. తద్వారా శారీరక అభివృద్ధితో పాటు పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్టేడియంల్లో అన్ని వసతులు ఉన్నందున వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, పీడీలు షఫీక్ అహ్మద్ పాల్గొన్నారు.

విజేతలు వీరే

జిల్లాస్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాలల్లో గెలుపొందిన వారి జట్ల వివరాలిలా ఉన్నాయి. అండర్-17 బాలుర విభాగం కబడ్డీలో వైరా, ఖమ్మం, ఖో-ఖోలో ఖమ్మం నార్త్, మధిర, వాలీబాల్‌లో వైరా, ఖమ్మం నార్త్, అండర్ -14 బాలుర కబడ్డీలో ఖమ్మం సౌత్, సత్తుపల్లి, ఖో-ఖోలో వైరా, కూసుమంచి, వాలీబాల్‌లో కూసుమంచి, ఖమ్మం నార్త్ జోన్ జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.